అంధుల పాఠశాలలో ప్రవేశాలు

మంచిర్యాల కలెక్టరేట్, జూన్ 14 : అంధ విద్యార్థులకు కరీంనగర్ జిల్లా కేంద్రంలోని శాతవాహన యూనివర్శిటీ ఎదురుగా మల్కాపూర్ రోడ్డులో ఉన్న ప్రభుత్వ అంధుల ఆశ్రమ పాఠశాలలో అడ్మిషన్లు పొందాలని ప్రిన్సిపాల్ నర్మద శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 1 నుంచి 7వ తరగతి వరకు ఇంగ్లీష్ మీడియం, 1 నుంచి 10వ తరగతి వరకు తెలుగు మీడియంలో బోధిస్తామన్నారు. 6 నుంచి 14 ఏళ్ళ మధ్య వయస్సు, సదరం సర్టిఫికెట్ ఉండాలని సూచించారు. వివరాలకు 9494317315, 9440338424లో సంప్రదించాలన్నారు.

అంత్యోదయ కార్డులపై విచారణ జరపాలి

మందమర్రి టౌన్, జూన్ 14: మందమర్రిలో అందించిన అంత్యోదయ కార్డులపై విచారణ జరపాలని శుక్రవారం అదనపు కలెక్టర్ మోతిలాల్‌కు టీడీపీ నాయకులు వినతిపత్రం అందించారు. పట్టణ అధ్యక్షుడు వాసాల సంపత్ మాట్లాడుతూ సంపన్నులు కూడా అంత్యోదయ కార్డు కార్డులు కలిగి ఉన్నారని, దళారుల చేతివాటంతో పెద్ద ఎత్తున దుర్వినియోగం అయ్యాయని పేర్కొన్నారు. ఆసరా పింఛన్లు తీసుకుంటున్న అనర్హత గల వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. నాయకులు గొల్లపల్లి ఓదెలు, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వినోద్‌కు మంత్రి పదవి ఇవ్వాలి

బెల్లంపల్లి, జూన్ 14: బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్‌వెంకటస్వామికి మంత్రి పదవి ఇవ్వాలని మున్సిపల్ ఫోరం రాష్ట్ర చైర్మన్ రాము నాయక్ ఏఐసీసీ ప్రెసిడెంట్ మల్లికార్జున ఖర్గేకు, సీఎం రేవంత్‌రెడ్డికి రిజిస్టర్ పోస్టు ద్వారా వినతిపత్రాలు పంపించారు. ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే వినోద్‌వెంకటస్వామి గతంలో మంత్రిగా పనిచేశారని పేర్కొన్నారు. కౌన్సిలర్లు అఫ్సర్, కొక్కెర చంద్రశేఖర్, నీలి కృష్ణ, నాయకులు ఎలిగేటి శ్రీనివాస్, మంగమూర్తి, మురళీ, నెల్లి రమేష్, శంకర్‌సింగ్ పాల్గొన్నారు.

ప్రజాపాలన సవరణ దరఖాస్తుల స్వీకరణ



ఎంపీడీవో కార్యాలయంలో దరఖాస్తులు స్వీకరిస్తున్న సిబ్బంది

దండేపల్లి,జూన్ 14: ఆరు గ్యారంటీ పథకాల కోసం లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించిన వాటిలో రాయితీ విద్యుత్ బిల్లు, గ్యాస్ కనెక్షన్ తదితర పథకాల్లో దొర్లిన తప్పులను సవరించుకునేందుకు మళ్లీ దరఖాస్తు స్వీకరిస్తున్నట్లు ఎంపీడీవో ప్రసాద్ పేర్కొన్నారు. ప్రజాపాలన దరఖాస్తులను స్వీకరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని, మండల ప్రజలు ఈ అవకాశంను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశామన్నారు. ముందస్తుగా రోజుకు వంద మందికి టోకెన్ ఇస్తున్నామన్నారు.

కేంద్ర మంత్రులను కలిసిన రఘునాథ్



కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌ను సన్మానిస్తున్న రఘునాథ్

ఏసీసీ, జూన్ 14: కేంద్ర బొగ్గు గనుల శాఖ సహాయ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన కిషన్‌రెడ్డి, హోంశాఖ సహాయ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన బండి సంజయ్‌లను శుక్రవారం ఢిల్లీలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్ మర్యాద పూర్వకంగా కలిశారు. శుభాకాంక్షలు తెలిపి శాలువాలతో సన్మానించారు. జిల్లాలోని బొగ్గు గని కార్మికుల సమస్యలను పరిష్కరించాలని మంత్రి కిషన్‌రెడ్డిని కోరినట్లు రఘునాథ్ తెలిపారు. జాతీయ ఫిల్మ్ సెన్సార్ బోర్డు సభ్యుడు అక్కల సుధాకర్, వెరబెల్లి రవీందర్‌రావు, పురుషోత్తం, రమణరావు, సతీష్, పాల్గొన్నారు.

ట్రస్టు కార్యక్రమాలు మరో పదేళ్ళు కొనసాగుతాయి



బక్రీద్ తోఫాలను అందిస్తున్న ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షురాలు

ఏసీసీ, జూన్ 14 : కొక్కిరాల రఘుపతిరావు చారిటబుల్ ట్రస్టు ద్వారా మంచిర్యాల నియోజకవర్గ ప్రజలకు సేవా కార్యక్రమాలు మరో పదేళ్ళు కొనసాగుతాయని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు అన్నారు. శుక్రవారం ఆయన నివాసంలో ముస్లిం మహిళలకు డీసీసీ అధ్యక్షురాలు సురేఖతో కలిసి బక్రీద్ తోఫాలను అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రంజాన్ సమయంలో అసెంబ్లీ ఎన్నికల కోడ్ ఉన్నందున ఇవ్వలేదని, ఇప్పుడు ఇస్తున్నామన్నారు. ట్రస్టు ద్వారా సేవా కార్యక్రమాలు నిలిచిపోతాయనే అపోహలకు తావు లేదన్నారు. పట్టణాధ్యక్షుడు తూముల నరేష్, బ్లాక్ అధ్యక్షుడు పూదరి తిరుపతి, మున్సిపల్ చైర్మన్ ఉప్పలయ్య, పెంట రజిత, హేమలత, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

నస్పూర్: పట్టణంలోని ముస్లిం సోదరులకు బక్రీద్ పురస్కరించుకుని ఎంఎం గార్డెన్ ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే ప్రేంసాగర్ రావు, డీసీసీ అధ్యక్షురాలు సురేఖలు తోఫాలను పంపిణీ చేశారు. మున్సిపల్ చైర్మన్ సుర్మిళ్ల వేణు, వైస్ చైర్మన్ గెల్లు రజిత, కౌన్సిలర్లు అగల్ డ్యూటీ రాజు, బోయ మల్లయ్య, సీపతి సుమతి మల్లేష్, బండి పద్మ, సంధ్యారాణి, నాయకులు సుధాకర్, మధుకర్, యశోద పాల్గొన్నారు.

రీవెరిఫికేషన్‌లో 10 జీపీఏ

మందమర్రిరూరల్, జూన్ 14: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ఆదర్శ పాఠశాల విద్యార్థిని శ్రద్దాఆర్య 9.7 జీపీఏ సాధించింది. మార్కుల రీవెరిఫికేషన్ చేయించడంతో శ్రద్దాఆర్యకు 10 జీపీఏ వచ్చినట్లు ప్రిన్సిపాల్ జయకృష్ణరెడ్డి తెలిపారు.

నిబంధనలు పాటించని స్కూలు బస్సులు

- విద్యాసంస్థల బస్సుల్లో ఫిట్‌నెస్ లోపం
- అధికారుల తనిఖీల్లో వెలుగు చూస్తున్న వైనం
- గడువు ముగిసిన 109 బస్సుల సీజ్
- ప్రమాదం జరిగితే భారీ మూల్యం చెల్లించాల్సిందే

మంచిర్యాల, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు విద్యా సంస్థల్లో విద్యార్థుల భద్రతను యాజమాన్యాలు గాలికి వదిలివేస్తున్నాయి. ప్రైవేట్ విద్యా సంస్థలు విద్యార్థులను ఇంటి నుంచి తీసుకురావడం, తిరిగి చేర్చేందుకు స్కూల్ బస్సులను ఏర్పాటు చేస్తున్నాయి. అయితే పాఠశాలల్లో నడిచే బస్సులు నిబంధనలకు విరుద్ధంగా ఉంటూ విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నా యాజమన్యాలు పట్టించుకోవడంలేదు. పలు స్కూల్ బస్సుల్లో పిల్లల రక్షణకు సంబంధించి చర్యలు చేపట్టడంలో యాజమాన్యాలు విఫలమవుతున్నాయి. ఫిట్‌నెస్ తనిఖీ సమయాల్లో కొంత నిబంధనలు పాటిస్తున్నప్పటికీ పూర్తిస్థాయిలో భద్రత ఏర్పాట్లు చేపట్టడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా పాఠశాలలు, కళాశాలలకు చెందిన 478 బస్సులు నడుస్తున్నట్లు రవాణాశాఖ అధికారులు తెలిపారు. అడ్మిషన్ల సమయంలో విద్యార్థుల సంఖ్యపై పెట్టే దృష్టి వారి భద్రతపై కనబరచడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.



స్కూల్ బస్సులను తనిఖీ చేస్తున్న రవాణాశాఖ అధికారులు



బస్సులకు కానరాని గ్రిల్స్

విద్యార్థుల భద్రత కోసం బస్సుకు తప్పనిసరిగా ఇనుప గ్రిల్స్ ఏర్పాటు చేయాలనే నిబంధన ఉంది. పాఠశాలల బస్సుల్లో ప్రయాణించేది చిన్నపిల్లలు కావడంతో బస్సు కదిలేటప్పుడు కిటికీల నుంచి చేతులు బయటకు పెట్టకుండా గ్రిల్స్ ఏర్పాటు చేయాలి. ప్రస్తుతం జిల్లాలోని విద్యా సంస్థల బస్సుల్లో చాలావాటికి గ్రిల్స్ ఏర్పాట్లు కానరావడం లేదు.

ఫైర్ ఎస్టింగిషర్లు ఎక్కడ..?

అనుకోని పరిస్థితులలో ఏదైనా ప్రమాదం సంభవించి బస్సులో మంటలు చెలరేగిన సమయంలో వాటిని ఆర్పేందుకు ఫైర్ ఎస్టింగిషర్లు ఉపయోగించాలి. అగ్ని మాపక శాఖ నుంచి అనుమతి తీసుకొని బస్సుల్లో ఫైర్ ఎస్టింగిషర్లు ఏర్పాటు చేయాల్సిన యాజమాన్యాలు నిబంధనలు తుంగలో తొక్కుతున్నాయి.

నామమాత్రంగా ఫస్ట్ ఎయిడ్ బాక్సులు

బస్సుల్లో ఫస్ట్ ఎయిడ్ బాక్సులు ఏర్పాటు చేస్తున్నప్పటికీ అందులో ప్రథమ చికిత్సకు సంబంధించి ఎలాంటి పరికరాలు ఉండటం లేదు. చిన్న చిన్న ప్రమాదాలు జరిగినప్పుడు విద్యార్థులకు ప్రథమ చికిత్స అందించేందుకు ఫస్ట్ ఎయిడ్ బాక్సులు ఉపయోగపడతాయి. వీటితో పాటు విద్యార్థులు బ్యాగులు పెట్టుకునేందుకు ప్రత్యేక ఏర్పాట్లు ఉండాల్సి ఉండగా అవేమి ఉండడంలేదు. డ్రైవరుకు సంబంధించిన పూర్తి వివరాలు, ఫొటో, పేరు, సెల్ నంబర్ విధిగా ప్రదర్శించాలనే నిబంధన ఉంది.

ఊసేలేని డ్రైవర్ల మెడికల్ సర్టిఫికెట్లు

విద్యా సంస్థల బస్సుల్లో పని చేసే డ్రైవర్లకు రెండు సంవత్సరాలకు ఒకసారి వైద్య పరీక్షలు చేయించి మెడికల్ సర్టిఫికెట్ అందుబాటులో ఉండాలి. ఈ విషయమై యాజమాన్యాలు దృష్టి సారించడంలేదని సమాచారం. డ్రైవర్ పూర్తి ఆరోగ్యంగా ఉన్నట్లు యాజమాన్యాలు ధ్రువీకరించుకోవాల్సిన అవసరం ఉండగా అవేమి పట్టించుకోవడం లేదు. బస్సు డ్రైవర్ల వయస్సు 50 సంవత్సరాల లోపు ఉండాలనే నిబంధన ఉన్నప్పటికీ అంతకు పైబడి వయస్సు ఉన్న వారు బస్సులను నడుపుతుండటం గమనార్హం. అలాగే హెవీ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండి5 సంవత్సరాల అనుభవం ఉన్న వారినే డ్రైవర్లుగా నియమించుకోవాలనే నిబంధన ఉన్నా యాజమాన్యాలు ఈ విషయాన్ని తేలికగా తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. పాఠశాల నుంచి బస్సులు 30 కిలో మీటర్ల లోపు ప్రయాణించాల్సి ఉండగా అంత కంటే ఎక్కువ దూరం విద్యార్థులను తరలిస్తున్నాయి.

వందకు పైగా కాలం చెల్లిన బస్సులు

జిల్లాలోని వివిధ విద్యాసంస్థలకు చెందిన 109 బస్సులు కాలం చెల్లినవిగా రవాణాశాఖ అధికారులు గుర్తించారు. ఇన్‌చార్జి ఆర్టీవో సంతోష్ నేతృత్వంలో అధికారులు తనిఖీలు చేపడుతున్నారు. తనిఖీల్లో 109 బస్సులకు 15 సంవత్సరాల జీవితకాలం దాటి పోయిన విషయం వెలుగులోకి వచ్చింది. తనిఖీల సమయంలో అధికారులు లైట్‌లు, హ్యాండ్ బ్రేక్, ఇన్సూరెన్స్, డ్రైవింగ్ లైసెన్స్‌లు, బస్సు రంగు పరిశీలించి ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు జారీ చేస్తున్నారు. రవాణాశాఖ అధికారులు విద్యా సంస్థల బస్సులపై పూర్తిస్థాయిలో దృష్టి సారించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఏప్రిల్ నుంచి రెండు పూటలా తాగునీరు

మంచిర్యాల, నస్పూర్ మున్సిపల్ సమావేశాల్లో ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు



మంచిర్యాల, నస్పూర్ మున్సిపల్ సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే, చైర్మన్

ఏసీసీ, జూన్ 14: పట్టణంలో ఏప్రిల్ నుంచి రోజుకు రెండు పూటలా స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు ప్రణాళిక రూపొందించామని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు అన్నారు. శుక్రవారం మంచిర్యాల మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశాన్ని చైర్మన్ రావుల ఉప్పలయ్య అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో సమావేశంలో 21 ఎజెండా అంశాలను కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదించింది. ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు మాట్లాడుతూ మంచిర్యాల పట్టణంలో మార్చిలోగా పైపులైన్ పనులను పూర్తి చేసి ఏప్రిల్ నుంచి అన్ని వార్డులకు రెండు పూటలా తాగునీరు అందిస్తామన్నారు. పెరుగుతున్న జనాభాను దృష్టిలో ఉంచుకుని రాబోయే 30 సంవత్సరాలకు అవసరమయ్యే మంచినీటి పనులకు ప్రణాళిక రూపొందించాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. విద్యుత్ ట్రాన్స్‌కో అధికారులు అంతరాయం లేకుండా చూడాలన్నారు.

మంచిర్యాల పట్టణంలోని వివిధ ఏరియాల్లో విద్యుత్ స్తంభాలు తరలించడానికి అయ్యే అంచనా వ్యయం కింద విద్యుత్ శాఖకు రూ.4.28 లక్షలు చెల్లించడానికి కౌన్సిల్ ఆమోదం తెలిపింది. 15వ ఫైనాన్స్ కమిషన్ గ్రాంట్ నిధులు రూ.2.73 కోట్లతో వివిధ వార్డుల్లో మంచినీటి సరఫరా, హెచ్‌డీపీఈ పైపులైన్ నిర్మాణానికి కౌన్సిల్ ఆమోదం తెలిపింది.. మున్సిపల్ సాధారణ నిధుల నుంచి రూ.1.32 కోట్లతో వివిధ వార్డుల్లో అభివృద్ధి పనులు, వివిధ ఏరియాల్లో ఏర్పాటు చేసిన 292 సీసీ కెమెరాల నిర్వహణ కాల పరిమితి మార్చి 2024తో ముగిసినందున 2024-25 సంవత్సరానికి నిర్వహణకు రూ.5.78 లక్షలు చెల్లించడానికి కౌన్సిల్ ఆమోదం పొందారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రూ.95 వేల చెల్లింపు, రంజాన్ సందర్భంగా అండాలమ్మ కాలనీ ఈద్గా వద్ద రూ.95 వేలు చెల్లించేందుకు కౌన్సిల్ ఆమోదం పొందారు. కమిషనర్ మారుతి ప్రసాద్, మేనేజర్ విజయ్‌కుమార్, ఇంజనీర్ మధుకర్, ఏఈలు రాజేందర్ పాల్గొన్నారు.

నస్పూర్: నస్పూర్ మున్సిపాలిటీ సమావేశం చైర్మన్ సుర్మిళ్ల వేణు అధ్యక్షతన జరిగింది. ఏజెండాలో పొందు పరిచిన 20 అంశాలపై చర్చించి కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు మాట్లాడుతూ వర్షకాలంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మురుగు కాలువల పూడిక తొలగించాలన్నారు. వేలాడుతున్న విద్యుత్ వైర్లతో పాటు శిథిలావస్థకు చేరిన స్తంభాలను తొలగించి వాటి స్థానంలో కొత్త స్తంభాలు వేయాలన్నారు. మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికి తాగు నీటి సరఫరా చేయాలన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ గెల్లు రజిత, కమిషనర్ చిట్యాల సతీష్, తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్‌ఓ సతీష్, ఏఇ మధు, విద్యుత్ ఏఈ రాంమూర్తి వివిధ వార్డుల కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

చెన్నూరు/భీమారం, జూన్ 14: కిష్టంపేటలోని 132కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతు కారణంగా పొక్కురు, దుగ్నేపల్లి, కొమ్మెర గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి 1 గంట వరకు విద్యుత్ ఉండదని చెప్పారు.

బోరు ఏర్పాటు

చెన్నూరు, జూన్ 14: మండలంలోని కన్నెపల్లిలో శుక్రవారం బోరు వేయించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ సీనియర్ నాయకుడు హేమంత్‌రెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే ఇచ్చిన హామీ మేరకు బోరు వేయించామన్నారు.

గీత కార్మికుడిని ప్రభుత్వం ఆదుకోవాలి

జైపూర్, జూన్ 14: కిష్టాపూర్ గ్రామానికి చెందిన గీత కార్మికుడు బొంగోని రమేష్‌గౌడ్ ఈ నెల 9న తాటిచెట్టు పైనుంచి కింద పడగా తీవ్ర గాయాలపాయ్యాడు. ప్రభుత్వం రమేష్‌గౌడ్ వైద్య ఖర్చులను భరించాలని కుటుంబీకులతో పాటు గౌడ సంఘం నాయకులు కోరుతున్నారు.

న్యాయం చేయాలని మృతుల బంధువుల రాస్తారోకో

- భవన యజమానులతో ఏసీపీ చర్చలు
- ఆందోళన విరమణ



ఐబీ చౌరస్తాలో ధర్నా చేస్తున్న మృతుల కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఏసీపీ

ఏసీసీ, జూన్ 14: మంచిర్యాలలో గోడ కూలి ముగ్గురు కూలీలు ఎనాంక హన్మంతు, గోలెం పోచం, ఆత్రం శంకర్ మృతిచెందగా న్యాయం చేయాలని మృతుల కుటుంబీకులు, బంధువులు శుక్రవారం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఎదుట రాస్తారోకో చేపట్టారు. అరగంట పాటు ట్రాఫిక్ స్తంభించిపోయింది. ఏసీపీ ప్రకాష్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతుల కుటుంబాలతో మాట్లాడారు. సంబంధిత భవన యజమానిని అక్కడికి పిలిపించి చర్చలు జరిపారు. మృతి చెందిన ఒక్కో కార్మికుడి కుటుంబానికి రూ. 6.5 లక్షలు, గాయపడ్డ కార్మికుడు మైదం రామన్నకు రూ.2 లక్షలు నష్టపరిహారం చెల్లించేందుకు యజమాని అంగీకరించడంతో ఆందోళన విరమించారు.

సిర్పూరు ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చి మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి రావాల్సిన ఆర్థిక సహాయం అందేలా కృషి చేస్తానన్నారు.

మృతుల కుటుంబాలకు అండగా ఉంటాం

జిల్లా కేంద్రంలో గురువారం జరిగిన దుర్ఘటనలో మృతి చెందిన వలస కూలీల కుటుంబాలకు అండగా ఉంటామని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు భరోసా ఇచ్చారు. శుక్రవారం ప్రభుత్వ ఆసుపత్రిలో మృతుల కుటుంబాలను పరామర్శించారు. మృతుల కుటుంబాలకు ఆర్థిక సహాయం అందేలా కృషి చేస్తామన్నారు. కార్మిక శాఖ నుంచి మృతి చెందిన ఒక్కో కుటుంబానికి రూ.2 లక్షలు మంజూరు చేయిస్తానని తెలిపారు. ఘటనకు కారణమైన భవన యాజమానుల నుంచి నష్టపరిహారం ఇప్పిస్తానని భరోసా కల్పించారు. ఘటనకు బాధ్యులైన భవన నిర్మాణ యజమానులతో ప్రేంసాగర్‌రావు చర్చించి పరిహారం చెల్లించాలని సూచించగా అందుకు వారు సమ్మతించారు.



మృతుల కుటుంబాలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

సురక్షితమైన నీరందించేందుకే మిషన్ భగీరథ సర్వే

జన్నారం, జూన్ 14: ప్రజలకు సురక్షితమైన నీరు అందించేందుకే మిషన్ భగీరథ సర్వే చేపడుతున్నట్లు అదనపు కలెక్టర్ రాహుల్ పేర్కొన్నారు. శుక్రవారం ధర్మారం, కిష్టాపూర్, రేండ్లగూడ గ్రామాల్లో పర్యటించి మిషన్ భగీరథ సర్వేను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రతీ ఇంటికి మిషన్ భగీరథ నీరు అందించేందుకు సర్వే చేపడుతున్నామని, సర్వే సిబ్బందికి ప్రజలు సహకరించాలని కోరారు. ఈఈ వెంకటేశం, ఎంపీవో రమేష్, అధికారులు పాల్గొన్నారు.

పాఠశాలలను సందర్శించిన అదనపు కలెక్టర్

కిష్టాపూర్ జెడ్పీహెచ్ఎస్, ధర్మారంలోని యూపీఎస్ పాఠశాలలను అదనపు కలెక్టర్ రాహుల్ సందర్శించారు. ధర్మారం పాఠశాలలో జరిగిన అక్షరాభ్యాస కార్యక్రమంలో పాల్గొన్నారు. కిష్టాపూర్ జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో జరుగుతున్న భవనాల నిర్మాణ పనులను పరిశీలించారు. పనులను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ఎంపీటీసీ మమత, కార్యదర్శులు, హెచ్ఎంలు పాల్గొన్నారు.

సర్వేను పరిశీలించిన డీఎల్‌పీవో

జైపూర్: మండలంలోని గంగిపల్లి, కిష్టాపూర్, శెట్‌పల్లి గ్రామాల్లో జరుగుతున్న మిషన్ భగీరథ సర్వేను డీఎల్‌పీవో ధర్మారాణి పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ గ్రామాల్లోని ప్రతి ఇంటిని సర్వే చేసి కుటుంబీకుల వివరాలు, నల్లా కనెక్షన్ వివరాలను యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. మండల పంచాయతీ అధికారి అనిల్‌కుమార్, పంచాయతీ కార్యదర్శులు శ్రావణ్‌కుమార్, ప్రశాంత్, ప్రతిభా రాణి పాల్గొన్నారు.



జన్నారంలో అధికారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

వేమనపల్లి: నీల్వాయి, కేతనపల్లి, ముల్కలపేట గ్రామాల్లో జరుగుతున్న మిషన్ భగీరథ సర్వేను మండల పంచాయతీ అధికారి శ్రీపతి బాపురావు పరిశీలించారు. నీల్వాయిలో పారిశుధ్య పనులను పరిశీలించారు. రోడ్లను, మురికి కాలువలను శుభ్రం చేయాలన్నారు. కార్య దర్శులు అశోక్, జాఫర్‌అలీ, ఫీల్డ్ అసిస్టెంట్‌లు కిషన్, శంకర్ పాల్గొన్నారు.

గిరిజన స్టడీ సర్కిల్ ద్వారా ఇంటిగ్రేటెడ్ గైడెన్స్ శిక్షణ

మంచిర్యాల కలెక్టరేట్, జూన్ 14: సివిల్ సర్వీసెస్ పరీక్షలు 2025కుగాను ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులకు రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో హైద్రాబాద్ రాజేంద్రనగర్‌లో గల గిరిజన ఐఎఎస్ స్టడీ సర్కిల్ ద్వారా రెసిడెన్షియల్ పద్ధతిలో శిక్షణ అందించేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి గంగారాం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 30 లోగా ఆన్ లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 6281766534లో సంప్రదించాలన్నారు.

స్కాలర్‌షిప్‌నకు ఎంపిక

భీమారం, జూన్ 14 : నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్‌షిప్‌నకు జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల విద్యార్థి దాసరి అరుణ్, బూరుగుపల్లి పాఠశాల విద్యార్థి ధరావత్ సంతోష్‌లు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్‌రావు, విజయ్‌కుమార్‌లు శుక్రవారం తెలిపారు. వారు మాట్లాడుతూ 2023-24 విద్యా సంవత్సరంలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులను ఎన్ఎంఎంఎస్ పరీక్షకు సన్నద్ధం చేయగా విద్యార్థులు ఎంపికయ్యారని తెలిపారు.

సరిపడా తాగు నీరందక కాలనీవాసుల ఇబ్బందులు

శ్రీరాంపూర్, జూన్ 14: సీసీసీ టౌన్‌షిప్ లోని సింగరేణి క్వార్టర్లకు తాగునీరు సరఫరా సరిపడా రాకపోవడంతో కార్మిక కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయి. కొన్నేళ్లుగా టౌన్‌షిప్ ఏరియా, ఆర్‌కె 5 కాలనీల్లో కార్మికులకు క్వార్టర్లు కేటాయించారు. వాటి అవసరం నిమిత్తం ఈ ప్రాంతంలో వాటర్ ట్యాంక్ కూడా నిర్మించారు. దాని నుంచి క్వార్టర్లకు నీటిని అందిస్తున్నారు. గతంలో నీటి ప్రెషర్ సరియైన మోతాదులో వచ్చేదని, ఇప్పుడు తక్కువగా వస్తోందని తెలిపారు. ఐదు రోజులుగా నీటి ప్రెషర్ తగ్గించడం, కేవలం 20 నిమిషాలే సరఫరా చేయడంతో కార్మిక కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయి. నీరు సరిపోవడం లేదని గగ్గోలు పెడుతున్నాయి. ఈ విషయం గురించి స్థానిక ఉద్యోగులను అడిగితే వారి నుంచి సరియైన సమాధానం రావడం లేదని కార్మిక కుటుంబాలు పేర్కొంటున్నాయి. అధికారులు స్పందించి నీటి ప్రెషర్ పెంచుతూ, గతంలో మాదిరిగా ఎక్కువ సమయం నీటిని విడుదల చేయాలని కార్మికులు కోరుతున్నారు.

రామప్ప సరస్సులో అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి

- చెన్నూరువాసిగా గుర్తించిన పోలీసులు

వెంకటాపూర్(రామప్ప), జూన్ 14: మండలంలోని పాలంపేట గ్రామంలో గల రామప్ప సరస్సులో మునిగి ఓ వ్యక్తి అనుమానాస్పదస్థితిలో మృతి చెందిన సంఘటన శుక్రవారం ఉదయం వెలుగులోకి వచ్చింది. స్థానిక ఎస్సై చల్ల రాజు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మృతుడి వివరాలు పూర్తిగా తెలియరాలేదు. మృతుడు తీసుకువచ్చిన ద్విచక్రవాహనం సేషీ నంబర్ ఆధారంగా మంచిర్యాల జిల్లా చెన్నూరు గ్రామానికి చెందిన చందర్ గుజ్జర్(40)గా గుర్తించినట్లు తెలిపారు. మృతుడి కుటుంబసభ్యులకు సమాచారం అందించామని, వారు వచ్చిన తర్వాతనే పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని అన్నారు. మృతదేహాన్ని ములుగు ఏరియా ఆస్పత్రిలోని మార్చురీలో భద్రపరిచినట్లు ఆయన వెల్లడించారు.

డ్రైవర్లు ఏకాగ్రతతో బస్సులను నడిపించాలి

- డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ పురుషోత్తం

భగత్‌నగర్, జూన్ 14: డ్రైవర్లు ఏకాగ్రతతో బస్సులను నడిపించాలని, ఆర్టీసీ డ్రైవర్లకు అనుభవజ్ఞులైన డ్రైవర్లతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ పురుషోత్తం అన్నారు. ప్రతి త్రైమాసికంలో ప్రశంసా పత్రాలు, నగదు పురస్కారాలు అందించడంతో డ్రైవర్లకు ఉత్తేజం కలుగుతుందన్నారు. కరీంనగర్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వినోద్ కుమార్ మాట్లాడుతూ కరీంనగర్ జోన్‌కు ఎంతో చరిత్ర ఉందని, రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో ఉంటుందన్నారు. సిబ్బంది కృషి ఫలితంగానే సాధ్యమవుతుందన్నారు. మహాలక్ష్మి పథకంతో ఆర్టీసీకి ఎంతో పేరు వచ్చిందన్నారు. కరీంనగర్ జోన్‌కు ప్రతి రోజు 5.05 కోట్లు లక్ష్యం కాగా ప్రతిరోజు 5.14 కోట్లు ఆర్జిస్తున్నామన్నారు. రానున్న రోజుల్లో డీలక్స్ ఆపై సర్వీసులలో ఆదాయాన్ని పెంపొందించుకొనుటకు కృషి చేయాలన్నారు. ప్రతి డ్రైవర్ ఏకాగ్రతతో బస్సులను నడిపించాలన్నారు. సెల్‌ఫోన్ వాడరాదని, ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చే బాధ్యత ప్రతి డ్రైవర్‌పై ఉందన్నారు. రీజినల్ మేనేజర్ సుచరిత మాట్లాడుతూ ఉత్తమ ప్రతి కనబర్చిన డ్రైవర్లు, కండక్టర్లు గ్యారెజీ సిబ్బంది సూపర్‌వైజర్లకు ప్రగతిచక్ర అవార్డులు అందించడం జరుగుతుందన్నారు. అవార్డులు సాధించిన ఉద్యోగులకు శుభాకాంక్షలు తెలిపారు. 3వ త్రైమాసికంలో 60 మంది ఉద్యోగులకు అవార్డులు అందుకున్నారు. ఈ కార్యక్రమలో డిప్యూటి రీజినల్ మేనేజర్ (మెకానికల్) కె సత్యనారాయణ, (ఆపరేషన్స్) ఎస్ భూపతిరెడ్డి, పర్సనల్ ఆఫీసర్ ఎం చంద్రయ్య, అకౌంట్స్ ఆఫీసర్ సిహెచ్ వెంకటేశ్వర్లు, రీజియన్‌లోని అన్ని డిపోల మేనేజర్లు, ట్రాఫిక్, మెకానికల్ సూపర్‌వైజర్లు, సేఫ్టీ వార్డెన్స్, డ్రైవింగ్ ఇన్స్‌పెక్టర్లు, వెల్ఫేర్ బోర్డు కమిటీ సభ్యులు, రీజినల్ మేనేజర్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉరి వేసుకుని వివాహిత ఆత్మహత్య


రమ్య (ఫైల్)

హాజీపూర్, జూన్ 14: మండలంలోని ముల్కలలో అవునూరి రమ్య (26) శుక్రవారం ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ముల్కల్ల గ్రామానికి చెందిన రమ్య 8 సంవత్సరాల క్రితం మంచిర్యాలకు చెందిన గోనె శేఖర్‌ను ప్రేమ వివాహం చేసుకుంది. సంవత్సరం కలిసి ఉన్న తర్వాత శేఖర్ మద్యానికి, పేకాటకు బానిసయ్యాడు. కట్నం కావాలని వేధించడంతోపాటు కొడుతూ, కులం పేరుతో దూషిస్తూ ఇంట్లో నుంచి వెళ్లగొట్టాడు. దీంతో రమ్య ముల్కల్లలోని పుట్టింటికి వచ్చింది. ఇటీవల అత్తగారింటికి రావాలని భర్త వేధింపులకు గురిచేయడంతో మనస్తాపంతో శుక్రవారం ఉదయం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలు తల్లి విజయ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ గోపతి సురేష్ తెలిపారు.

నేరాల నియంత్రణకే కమ్యూనిటీ కాంటాక్టు ప్రోగ్రాం


లంబాడిపల్లిలో ప్రజలతో మాట్లాడుతున్న సీఐ రవీందర్

చెన్నూరు, జూన్ 14: నేరాల నియంత్రణకే కమ్యూనిటీ కాంటాక్టు ప్రోగ్రాం నిర్వహిస్తున్నామని సీఐ రవీందర్ అన్నారు. శుక్రవారం లంబడిపల్లి, పొక్కూరు గ్రామాల్లో పోలీసులు, ఎక్సైజ్ సిబ్బందితో కలిసి కమ్యూనిటీ కాంటాక్టు ప్రోగ్రాం నిర్వహించారు. 42 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకుని తయారీకి సిద్ధంగా ఉన్న 2100 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. 8 మందిపై ఎక్సైజ్ సిబ్బంది కేసులు నమోదు చేశారు. సీఐ మాట్లాడుతూ ప్రజల రక్షణే పోలీసుల బాధ్యత అని తెలిపారు. అసాంఘీక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, బాగా చదువుకుంటూ క్రీడల్లో రాణించాలని సూచించారు. ఏదైనా ఆపద వస్తే డయల్ 100కు సమాచారం అందించాలన్నారు. సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. నిషేధిత పత్తి విత్తనాలు, గంజాయి, గుడుంబా అమ్మితే కఠిన చర్యలు ఉంటాయన్నారు. ఎక్సైజ్ ఎస్‌ఐ హరి, టాస్క్‌ఫోర్స్ సీఐ సమ్మయ్య, చెన్నూరు ఎస్‌ఐ వెంకటేశ్వర్‌రావు, భీమారం ఎస్‌ఐ రాములు , పోలీసులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం


ఆర్థిక సహాయం అందజేస్తున్న మిత్రులు

మందమర్రి టౌన్, జూన్ 14: పాత బస్టాండ్ ఏరియాలో టీకొట్టు నడుపుకొని జీవనం సాగించే పేరాల శ్రీనివాస్ అనారోగ్యంతో మృతి చెందాడు. నిరుపేద కుటుంబం కావడంతో ఆయన మిత్రులు శుక్రవారం రూ.10 వేల ఆర్థిక సహాయం కుటుంబ సభ్యులకు అందజేశారు. గజ్జెల్లి లక్ష్మణ్, మల్లయ్య, నాగుల దుర్గయ్య, సమ్మిరెడ్డి, తిరుపతి, ఎండీ పాషాలు ఉన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

మందమర్రిరూరల్(కాసిపేట), జూన్ 14: రక్తదానం ప్రాణదానంతో సమానమని దేవాపూర్ ఓరియంట్ సిమెంట్ కంపెనీ యూనిట్ హెడ్ మహేంద్ర ప్రతాప్ జోషి పేర్కొన్నారు. శుక్రవారం ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా కంపెనీ క్లబ్‌లో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రక్తదాతలు ముందుకు వచ్చి రక్తదానం చేయాలని, ఆపదలో ఉన్న వారికి రక్తం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ప్రతీ ఒక్కరు తమ బాధ్యతగా రక్తదానం చేయడం అలవాటు చేసుకోవాలన్నారు. శిబిరంలో దాదాపు 300 మంది రక్తదానం చేశారు. సిమెంట్ కంపెనీ మహిళ మండలి అధ్యక్షురాలు ప్రీతిజోషి, సీనియర్ జీఎం ఆనంద్‌కులకర్ణి, సత్యపాల్‌రెడ్డి, శరత్‌కుమార్, సత్యనారాయణ పాల్గొన్నారు.



అవార్డు అందుకుంటున్న రాజ్‌కుమార్, అవార్డు అందుకుంటున్న మంచిర్యాల రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ భాస్కర్‌రెడ్డి

రక్తదాత రాజ్‌కుమార్‌కు అవార్డు

శ్రీరాంపూర్: రక్తదాతల దినోత్సవం సందర్భంగా హైదరాబాద్ రాజ్‌భవన్‌లో అత్యధికసార్లు రక్తదానం చేసిన రక్తదాతకు అవార్డు అందించారు. శ్రీరాంపూర్‌లోని వృత్తి శిక్షణ కేంద్రంలో హెడ్ ఓవర్‌మెన్‌గా పనిచేస్తున్న దేవతల రాజ్‌కుమార్ ఉత్తమ రక్తదాతగా మంచిర్యాల జిల్లా నుంచి అవార్డు అందుకున్నారు. 54 సార్లు రక్తదానం చేసిన ఆయనకు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, గవర్నర్ ప్రిన్సిపల్ సెక్రటరీ బి. వెంకటేశం తదితరులు ప్రశంసాపత్రం, జ్ఞాపిక అందించారు. వీటీసీ మేనేజర్ కె.వి.రామారావు, రెడ్‌క్రాస్ సొసైటీ జీవితకాల సభ్యుడు కాసర్ల రంజిత్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

మంచిర్యాల రెడ్‌క్రాస్ సొసైటీకి అవార్డు

మంచిర్యాల కలెక్టరేట్, జూన్ 14: మంచిర్యాల జిల్లాలో రెడ్‌క్రాస్ సొసైటీ ద్వారా ఎక్కువ రక్తదాన శిబిరాలను నిర్వహించిన అర్బన్ బ్లడ్ సెంటర్ కేటగిరిలో మంచిర్యాల రెడ్‌క్రాస్ సంస్థకు రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని అవార్డు లభించింది. శుక్రవారం హైద్రాబాద్‌లో అవార్డును, ప్రశంసా పత్రాన్ని అందజేశారు. ఈ అవార్డును రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ కంకణాల భాస్కర్‌రెడ్డి మంత్రి పొన్నం ప్రభాకర్, హెల్త్ కమిషనర్ కర్ణన్ చేతుల మీదుగా అందుకున్నారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సంస్థ శాశ్వత సభ్యుడు రంజిత్‌కుమార్ తదిరతులు పాల్గొన్నారు.

సామూహిక అక్షరాభ్యాసం


చెన్నూరులో అక్షరాభ్యాసం చేయిస్తున్న ఎంఈవో రాధాకృష్ణమూర్తి, మామిడిపల్లిలో అక్షరాభ్యాసం

చెన్నూరు, జూన్ 14: చెన్నూరు పట్టణంలోని నల్లగొండ పోచమ్మ వాడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం విద్యార్థులతో ఎంఈవో కొమ్మెర రాధాకృష్ణమూర్తి సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, భోజనం అందిస్తామన్నారు. ప్రధానోపాధ్యాయులు నాగుల మహేశ్వర్‌రెడ్డి, తిరుపతయ్య, మహేశ్వర్‌రెడ్డి, రవీందర్, అన్నపూర్ణ, వీణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మందమర్రిరూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని ఎంపీడీవో రాజేశ్వర్ పేర్కొన్నారు. చిర్రకుంటలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు యూనిఫాంలు అందజేసి పిల్లల చేత అక్షరాలు దిద్దించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకోవాలని సూచించారు. మామిడిగట్టులో పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. నర్సరీని పరిశీలించి హరిత హారానికి మొక్కలను సిద్ధంగా ఉంచాలని సూచించారు. ఎంపీవో బీరయ్య, కార్యదర్శి సంధ్యారాణి, ఉపాధ్యాయు లు పాల్గొన్నారు.

దండేపల్లి: ప్రభుత్వ బడి...అమ్మ ఒడి లాంటిదని మామిడిపల్లి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధాయురాలు కవిత అన్నారు. బడిబాటలో భాగంగా చిన్నారులచే అక్షరాభ్యాసం చేయించారు. ఆమె మాట్లాడుతూ నాణ్యమైన విద్య లభిస్తుందని, పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని తల్లిదండ్రులకు సూచించారు. ఉచితంగా పాఠ్య పుస్తకాలు, ఏక రూప దుస్తులతో పాటు నోట్ బుక్స్, మధ్యాహ్నభోజనం ఉంటుందన్నారు. ఉపాధ్యాయులు అరుణ, సరిత, అంగన్‌వాడి టీచర్ల చంద్రకళ, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మురికి కాలువలు శుభ్రం చేయాలని మహిళల నిరసన

బెల్లంపల్లి, జూన్ 14 : పట్టణంలోని 18వ వార్డులో మున్సిపల్ అధికారులు మురికి కాలువలు శుభ్రం చేయడం లేదని వార్డు మహిళలు శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ మురికి కాలువలు శుభ్రం చేయించాలని మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోవడం లేదన్నారు. వర్షాలు కురిస్తే మురుగునీరు ఇండ్లలోకి చేరే అవకాశం ఉందని, దీంతో వ్యాధుల బారిన పడతామన్నారు. వెంటనే మురికి కాలువలను శుభ్రం చేయాలని డిమాండ్ చేశారు.

పురస్కారం ప్రదానం

మంచిర్యాల కలెక్టరేట్, జూన్ 14: జిల్లా కేంద్రంలోని హమాలీవాడకు చెందిన శ్రీరామోజు సాంబలక్ష్మీ హైద్రాబాద్‌లోని రవీంద్రభారతిలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో మహానంది పురస్కారాన్ని అందుకున్నారు. మ్యారేజ్ బ్యూరోలో అత్యధిక వివాహాలు జరిపించినందుకు పురస్కారానికి ఎంపిక చేశారు. మ్యారేజ్ బ్యూరో మీడియేటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బుర్ర శ్రీనివాస్‌గౌడ్, శివతేజలు పురస్కారాన్ని అందించారు. శాసన మండలి చైర్మన్ బండ ప్రకాష్‌ముదిరాజ్, ఎంపీ కృష్ణయ్య, బీసీ కమిషన్ చైర్మన్ కృష్ణమోహన్‌రావు, లక్ష్మణ్‌గౌడ్, శర్మ తదితరులు పాల్గొన్నారు.

రోటోవేటర్ కింద పడి డ్రైవర్ మృతి

చెన్నూరు, జూన్ 14 :చెన్నూరు మండలం కిష్టంపేట గ్రామ పరిసర ప్రాంతాల్లో పొలం పనులకు దుక్కి దున్నుతుండగా డ్రైవర్ మాంతయ్య (40) రోటోవేటర్ కింద పడి శుక్రవారం మృతిచెందాడు. స్థానికుల కథనం ప్రకారం మాంతయ్యది నెన్నెల మండలం చిత్తాపూర్ గ్రామం. కొంత కాలంగా కిష్టంపేట గ్రామానికి చెందిన ఓ రైతు వద్ద ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో పొలం దున్నేందుకు రోటోవేటర్‌తో వెళ్లిన మాంతయ్య పొలం దున్నుతూ ప్రమాదవశాత్తూ రోటోవేటర్ కింద పడి మృతిచెందినట్లు గ్రామస్థులు తెలిపారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మాంతయ్యకు భార్యతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు.

పాఠశాలలకు ప్రహారీలు లేక ఇబ్బందులు


ప్రహారీ లేని తుర్కపల్లి పాఠశాల

మందమర్రిరూరల్, జూన్ 14: తుర్కపల్లి, శంకర్‌పల్లి, పొన్నారం, ఎమ్మెల్యే కాలనీ లోని ప్రైమరీ పాఠశాలలకు ప్రహారీ లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రహారీ లేకపోవడంతో పశువులు పాఠశాలల్లోకి వస్తున్నాయి. పశువులు వేసిన పేడతో దుర్గంధం వెదజల్లుతు న్నాయి. మందు బాబులకు అడ్డాలుగా మారుతున్నాయి. మద్యం సీసాలు పాఠశాల ఆవరణలో పడేయడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం పాఠశాలలకు మరమ్మతు చేయిస్తున్నా ప్రహారీ నిర్మించడం లేదని గ్రామస్థులు పేర్కొంటున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పాఠశాలలకు ప్రహారీ నిర్మించాలని విద్యా ర్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

అలంకారప్రాయంగా వైకుంఠధామాలు


నిరుపయోగంగా ఉన్న లక్ష్మీపూర్‌లోని వైకుంఠధామం

- సౌకర్యాల కల్పనలో విఫలం
- దారి పొడుగునే దహన సంస్కారాలు
- పట్టించుకోని అధికారులు

రెబ్బెన, జూన్ 14: గ్రామాల అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం పల్లెల్లో డంపింగ్ యార్డులు, సెగ్రిగేషన్ షెడ్లతో పాటు అంతిమసంస్కారాల నిర్వహణకు వైకుంఠధామాలు నిర్మించింది. వీటి నిర్మాణానికి అందుబాటులో ఉన్న ప్రభుత్వ స్థలాలను అధికారులు కేటాయించారు. ఈ వైకుంఠదామాలు చేరుకోవటానికి దారి సౌకర్యం లేకపోవటంతో వెచ్చించిన లక్షల రూపాయలు వృధా అయ్యాయి. వైకుంఠదామాలు అలంకార ప్రాయంగా దర్శనమిస్తున్నాయి.

● ఏదీ ముందు చూపు..

మండలంలోని గంగాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలో సుమారు 2300వరకు జనాభా ఉండగా, లక్ష్మిపూర్ పంచాయతీలో 1200వరకు జనాభా ఉండగా, రెండు పంచాయతీలకు మంజూరైన వైకుంఠధామాలు, సెగ్రిగేషన్ షెడ్లు, డంపింగ్ యార్డుల నిర్మాణం కోసం గంగాపూర్ శివారులో ప్రభుత్వ స్థలాన్ని కేటాయించారు. ఒక్కో పంచాయతీకి ఎకరం చొప్పున స్థలం కేటాయించగా, రూ.12లక్షలతో వైకుంఠధామం, రూ.2లక్షల వ్యయంతో సెగ్రిగేషన్ షెడ్లు, ఉపాధి హామీ నిధులతో డంపింగ్ యార్డులు నిర్మించారు. అయితే వాటిని చేరుకునేందుకు దారి లేకపోవటంతో నిరుపయోగంగా మారాయి. దీంతో అంతిమ సంస్కారాలకు గ్రామానికి ఆనుకొని ఉన్న వాగులే దిక్కుగా మారాయి. భూమి ఉన్న ప్రజలు తమ కుటుంబ సభ్యుల అంతిమ సంస్కారాలను సొంత భూముల్లో నిర్వహిస్తుండగా, భూమిలేని వారు వాగును ఆశ్రయిస్తున్నారు. వాగు ఒడ్డున దహన సంస్కారాలు చేస్తున్నారు. ఆయా గ్రామాల్లో నుంచి ట్రాక్టర్లలో సేకరించిన చెత్తను డంపింగ్ యార్డుకు, సెగ్రిగేషన్ షెడ్డుకు తీసుకెళ్లేందుకు దారి లేకపోవటంతో చెత్తాచెదారాన్ని రోడ్డు పక్కన ఖాళీస్థలాల్లో పడేసి నిప్పు పెడుతున్నారు. దీంతో అదనపు ఆదాయం సమకూర్చుకునేందుకు వీలుగా నిర్మించిన సెగ్రిగేషన్ షెడ్లు నిరుపయోగంగా మారుతున్నాయి. ప్రజలు అవస్థలు పడుతున్నా కూడా అధికారులు ఇంతవరకు పట్టించుకోవటం లేదు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు స్పందించి వైకుంఠధామాలు అందుబాటులోకి వచ్చేట్లు చూడాలని అంతా కోరుతున్నారు.



వినియోగంలోకి తీసుకురావాలి..
- అరుణ్, గంగాపూర్

మండలంలో ఏర్పాటు చేసిన వైకుంఠధామాల్లోని సమస్యలను వెంటనే పరిష్కరించాలి. మంచి లక్ష్యంతో చేపట్టిన వీటిపై నిర్లక్ష్యం వహించటంతో పనికిరాకుండా పోతున్నాయి. కేవలం అలంకార ప్రాయంగా ఉంటున్నాయి. అధికారులు చర్యలు తీసుకోవాలి.

సమస్యలు పరిష్కరించాలి..
- వెంకన్న, గంగాపూర్



వైకుంఠధామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలి. అధికారులు ప్రత్యేక దృష్టిసారించాలి. లక్షలు పెట్టి నిర్మించిన వాటిని వృధాగా వదిలేయడం సరికాదు. వైకుంఠధామాలు వినియోగంలోకి రాకపోవటంతో వాగు ఒడ్డునే దహన సంసాకర్యాలు చేయాల్సిన దుస్థితి నెలకొంది.

అధికారులు చర్యలు తీసుకోవాలి..
-బి ఉపేందర్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి



అలంకారప్రాయంగా ఉన్న వైకుంఠధామాల విషయంలో అధికారులు చర్యలు తీసుకోవాలి. పభుత్వ నిధులు వృధా కాకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. గతంలో కూడా సమస్యలు పరిష్కరించాలని ఉన్నతాధికారుల దృష్టికి కూడా తీసుకెళ్లాం.

జాతీయప్రతిభా ఉపకార వేతనాలకు ఎంపిక

- నాలుగేళ్ల పాటు పొందనున్న విద్యార్థులు


ఉపకార వేతనాలకు ఎంపికైన విద్యార్థులు

ఆసిఫాబాద్ రూరల్, జూన్ 14: ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోన తెలంగాణ ఆదర్శ పాఠశా లకు చెందిన 19 మంది విద్యార్థులు జాతీయ ప్రతిభా ఉపకార వేతనాలకు (ఎన్‌ఎంఎంఎస్)కు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఖలీల్ తెలిపారు. గతేడాది డిసెంబరు 10న ఎనిమిదో తరగతి విద్యార్థులకు నిర్వహించిన ఎంపిక పరీక్షలో ప్రతిభ కనబర్చడంతో పాఠశాలకు చెందిన విద్యార్థులు కృష్ణవేణి, వైష్ణవి, శ్రీకాంత్, అలీజీఫైజీన్, మీనాక్ష, రిషిత, మధుప్రియ, సాహిత్య, హరిచందన, స్రవంతి, అక్షర, విష్ణువర్ధన్, రాకేష్, హర్షిత, శిరీష, రవిచంద్ర, మహ్మద్ తౌఫిక్, పల్లవి, కైఫ్ అలీలు ఎంపికైనట్లు తెలిపారు. వీరికి 9వ తరగతి నుంచి ఇంటర్ వరకు ఏటా రూ.12 వేల చొప్పున రూ.48 వేల ఉపకార వేతనం వస్తుందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రిన్సిపాల్‌తో పాటు ఉపాధ్యాయులు మహేష్, రాకేష్, ప్రవీణ్, రమేష్, సైఫుల్లా, సంపత్, వరలక్ష్మి, స్వరూప, శోభ, సుజాత, భాగ్యశ్రీ తదితరులు అభినందించారు.

నిందితుడిని కఠినంగా శిక్షించాలి


దహెగాం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న ఆరె కుల సంఘం నాయకులు

చింతలమానేపల్లి, జూన్ 14: పెద్దపల్లి జిల్లాలోని సుల్తానాబాద్ మండలంలో ఓ బాలికపై అత్యాచారం చేసి హత్య చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని ఆరెకుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. మండలకేంద్రంలో శుక్రవారం బాలిక చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. పలువురు మాట్లాడుతూ నిందితులకు కఠిన శిక్షపడే వరకు ఊర్కునేది లేదన్నారు. అధికారులు చర్యలు తీసుకోకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన ఉధృతం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ నానయ్య, జడ్పీటీసీ శ్రీదేవి, పెంటయ్య, హరి, చంద్రశేఖర్, కిరణ్, భద్రేశ్వర్, రాజన్న, బాలయ్య, సాయి, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

దహెగాం: నిందితుడిని కఠినంగా శిక్షించాలని ఆరె కుల సంఘం ఆధ్వర్యంలో ఎస్సై రాజు, తహసీల్దార్ కార్యాలయంలో డీటీ లలితకు వినతిపత్రం అందజేశారు. మానవ మృగాన్ని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అధికారులు చర్యలు తీసుకోకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని తెలిపారు. చిన్నారి ఆత్మకు శాంతి చేకూరాలని యువకులు, మహిళలు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. అధికారులు ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

జైనూర్, జున్ 14: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలు పరిసరాల పరిశుభ్రత పాటించాలని వైద్యాధికారి రాజు అన్నారు. మండలంలోని ఉషేగాం పీహెచసీ పరిధిలో శుక్రవారం వైద్యాధికారి రాజు అధ్వర్యంలో సిబ్బంది శుక్రవారం ఇంటింటికీ తిరిగి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని, ఈగలు, దోమలు వ్యాప్తి చెందకుండా చూసుకోవాలని సూచించారు. ఉషేగాం పీహెచ్‌సీలో ఉన్న గ్రామాల ప్రజలు మలేరియా, టైఫాయిడ్ వ్యాధులకు గురైతే వారికి పీహెచ్‌సీలోనే రక్త పరీక్షలు నిర్వహించి తగిన వైద్యం అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రమేశ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బెస్ట్‌అవైలబుల్ పాఠశాలకు విద్యార్థుల ఎంపిక


ఎంపికైన విద్యార్థి

ఆసిఫాబాద్, జూన్ 14: బెస్ట్ అవైలబుల్ పాఠశాలల్లో 2024-25 విద్యా సంవత్సరానికి గాను ప్రవేశాలకు అర్హత గల విద్యార్థులను లక్కీ డ్రా ద్వారా ఎంపిక చేసినట్లు అదనపు కలెక్టర్ దీపక్ తివారి తెలిపారు. శుక్రవారం కలెక్టరే ట్‌లోని సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ వేణు, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు రమాదేవితో కలిసి విద్యార్థుల తల్లిదండ్రుల సమక్షంలో లక్కీడ్రా నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడాధికారి మీనారెడ్డి, ఏసీఎంవో ఉద్ధవ్, ఏటీడీవో క్షేత్రయ్య, జడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు, ఎంపీపీ మల్లికార్జున్, తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

- రాష్ట్ర భూ పరిపాలన ప్రధాన కమిషనర్ నవీన్ మిట్టల్


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, అదనపు కలెక్టర్లు

ఆసిఫాబాద్, జూన్ 14: ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ధరణి, ప్రజావాణి కార్యక్రమాల ద్వారా అందిన దరఖాస్తులపై క్షుణ్ణంగా పరిశీలించి సంబంధిత అధికారుల సమన్వయంతో సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర భూ పరిపాలన ప్రధాన కమిషనర్ నవీన్ మిట్టల్ అన్నారు. హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శుక్రవారం కలెక్టర్‌లు, అదనపు కలెక్టర్‌లు, రెవెన్యూ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ సమస్యలకు పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ధరణి లోని వివిధ మాడ్యూల్స్ ద్వారా వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలని చెప్పారు. లోక్‌సభ ఎన్నికల కార్యచరణ ప్రకటనకు ముందే ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి 1.38 లక్షల పెండింగ్ దరఖాస్తులను పరిష్కచామని వివరించారు. ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తుల పరిష్కారం కోసం ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నామని తెలిపారు. వారసత్వం, సవరణలు, ఇతరాత్ర దరఖాస్తులను క్షేత్రస్థాయిలో విచారణ జరిపి పరిష్కారించాలన్నారు. అధిక దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్న మండలాలకు అవసరమైన అదనపు సిబ్బందిని కేటాయించాలని తెలిపారు. రాష్ట్ర స్థాయిలో ప్రతి మంగళవారం, శుక్రవారంలో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో వచ్చే భూ సంబంధిత సమస్యల దరఖాస్తులను కలెక్టర్‌లకు బదిలీ చేస్తామని చెప్పారు. ఈ దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యం నిస్తూ పరిష్క రించాలని సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా భూముల రిజిస్ట్రేషన్ విలువ పెంచేందుకు ప్రభుత్వం ప్రతిపాదనలను పరిశీలిస్తున్నదన్నారు. ఈ క్రమం లో భూముల మార్కెట్ విలువ, ప్రస్తుత రిజిస్టేషన్ విడుదల వివరాలతో కూడిన నివేదికను అందించాలన్నారు. సబ్ రిజిస్టర్ కార్యాలయంలో ఏర్పాటుకు అనువైన భవనం, భూమి కేటాయించి ప్రతిపాదనలు సమర్పిం చాలని చెప్పారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ భవన సముదాయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి కలెక్టర్ వెంకటేష్ దోత్రే, జిల్లా అదనపు కలెక్టర్ వేణు, ఆర్డీవోలు లోకేశ్వర్, సురేష్‌లతో కలసి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ధరణి పోర్టల్ ద్వారా జిల్లాలో భూ సంబంధిత సమస్యలపై 2,059 దరఖాస్తులు వచ్చాయన్నారు. ఇందులో విస్తీర్ణం, పేరు సవరణ, పట్టా పాసు పుస్తకాల వివరాల సవరణ, నూతన పాసు పుస్తకాల జారీ, నిషేధిత జాబితాలో ఉన్న పట్టా భూముల తొలగింపు, వారసత్వ పట్టాల మంజూరుకు దరఖాస్తులు ఉన్నాయని వివరించారు. వీటిని క్షేత్రస్థాయిలో పరిశీలించి నాలుగు రోజులలో పరిష్కరించే దిశగా చర్యలు చేడుతామని తెలిపారు. ఆర్డీవో, తహసీల్దార్‌ల వద్ద పెండింగ్‌లో ఉన్న లాగిన్ ఐడీ ద్వారా దరఖాస్తుల పరిష్కారం ప్రక్రియను వేగవంతం చేస్తామని తెలిపారు. రాష్ట్ర స్థాయిలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాకు సంబంధించి భూ సమస్యలపై వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకుం టామని చెప్పారు. సబ్ రిజిస్టర్ కార్యాలయ భవనానికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేపడుతామని తెలిపారు. సమావేశంలో తహసీల్దార్‌లు, కలెక్టరేట్ కార్యాలయం పర్యవేక్షకులు పాల్గొన్నారు.



వైద్యులు లేరు



కాగజ్‌నగర్‌లోని సామాజిక ఆరోగ్య కేంద్రం

సామాజిక ఆరోగ్య కేంద్రంలో వైద్యుల నియామకం చేపట్టక పోవడం తో రోగులు అవస్థలు పడుతున్నారు. రెండేళ్ల క్రితం అప్‌గ్రేడ్ చేస్తూ ఉత్వర్వులు జారీ చేసిన ప్రభుత్వం సరిపడా వైద్యులు, సిబ్బందిని నియ మించక పోవడంతో రోగులకు పూర్తి స్థాయిలో వైద్యం అందడం లేదు.

- సామాజిక ఆరోగ్య కేంద్రంలో అన్నీ సమస్యలే
- పేదలకు అందని వైద్యం
- వసతులు పెంచినా సేవలు నామమాత్రమే
- పట్టించుకోని అధికారులు

కాగజ్‌నగర్, జూన్ 14: కాగజ్‌నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని రెండేళ్ల క్రితం 30పడకల సామాజిక ఆరోగ్య కేంద్రం(సీహెచ్‌సీ)గా మార్పు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఇందుకు భవన నిర్మాణానికి, ఇతర వసతుల కోసం రూ.5కోట్ల నిధులను విడుదల చేసి అప్పటి మంత్రి తన్నీరు హరీష్‌రావుతో ఈ కేంద్రాన్ని ప్రారంభించారు. కాగా ఈ ఆస్పత్రిలో సరిపడా డాక్టర్లు, సిబ్బందిని నియమించకపోవడంతో మళ్లీ పాత కథే పునరావృతమవుతోంది. సమస్యల వలయంలో సీహెచ్‌సీ కొట్టుమిట్టాడుతోంది. నిత్యం రోగులు సంఖ్య పెరిగి పోతుండడం, డాక్టర్లు నియమించకపోవడంతో ఎక్కడి సమస్యలు అక్కడే పేరుకుపోతున్నాయి. ప్రస్తుతం ఆస్పత్రిని ఇన్‌చార్జీలతో కొనసాగిస్తున్నారు.

కీలక పోస్టులన్నీ ఖాళీలే..

ఈ ఆస్పత్రిలో కీలక పోస్టులన్నీ ఖాళీగా ఉన్నాయి. సివిల్ సర్జన్ డాక్టర్లు 13ఉండాల్సి ఉండగా ఒక్కటి కూడా భర్తీ కాలేదు. అలాగే స్పెక్రం సివిల్ సర్జన్ డాక్టర్లు 10 ఉండాల్సి ఉండగా అన్నీ ఖాళీలే ఉన్నాయి. 24గంటల పాటు సేవలు అందించేందుకు ఆర్‌ఎంవో డాక్టర్ పోస్టు-1 ఉండగా, అది కూడా ఖాళీగానే ఉంది. డిప్యూటీ సివిల్ సర్జన్ 8పోస్టులు, డిప్యూటీ డెంటల్ సర్జన్ పోస్టు-1, డెంటల్ అసిస్టెంట్ సర్జన్-1 ఖాళీలుగా ఉన్నాయి. అలాగే స్టాఫ్ విభాగంలో కూడా ఖాళీలే దర్శనమిస్తున్నాయి. అత్యాధునిక భవనం నిర్మించినప్పటికీ వైద్యుల పోస్టులన్నీ ఖాళీగా ఉండటంతో నిత్యం రోగులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. వివిధ రకాల వ్యాధులను పరిశీలించే పోస్టులు కేటాయించినప్పటికీ భర్తీ కాక పోవటంతో ఈ ప్రాంతవాసులకు శాపంగా పరిణమించింది. వసతు లు, మిషనరీ విభాగాలు అన్నీ ఉన్నాయి. చూసేందుకు డాక్టర్లు మాత్రం పూర్తిస్థాయిలో లేరు. ప్రస్తుతం 30పడుకల ఆస్పత్రి ఉండగా, దీన్ని 100 పడకలకు మారుస్తామని నాయకులు ప్రకటించినా కూడా ఇంతవరకు ఆచరణకు నోచుకోలేదు. ప్రస్తుతం నలుగురు ఇన్‌చార్జీ డాక్టర్లతో వైద్యసేవలు అందిస్తున్నారు.

నాలుగు చోట్ల బాధ్యతలు..

ఈ ఆస్పత్రిలో ఇన్‌చార్జీ సూపరింటెండెంట్‌గా డాక్టర్ చెన్నకేశవరావు పని చేస్తున్నారు. ఈ డాక్టర్ ఆసిఫాబాద్ ఆస్పత్రికి సూపరింటెండెంట్‌గా, డీసీహెచ్‌కు ఇన్‌చార్జీగా, సిర్పూరు(టి) సివిలాసుపత్రికి ఇన్‌చార్జీ సూపరిటెండెంట్‌గా కూడా వ్యవహరిస్తున్నారు. ఒక్క అధికారికే నాలుగు చోట్ల ఇన్‌చార్జీ బాధ్యతలు అప్పజెప్పారు. ఇలా కీలకపోస్టులన్నీ కూడా ఖాళీగా ఉండడంతో ఇన్‌చార్జీలతో నడిపిస్తున్నారు. దీంతో ఈ బాధ్యతలన్నీ తమకు తలకు మించిన భారం అవుతున్నాయని అధికారులు చెబుతున్నారు. రానున్న వర్షాకాలంలో పెను ప్రమాదం పొంచిఉంది. కాగజ్‌నగర్, సమీప ప్రాంతాల వాసులు ఇక్కడికే వైద్యపరీక్షల కోసం వస్తుంటారు. వర్షాకాలంలో జ్వరాలు, ఇతర వ్యాధులు సోకే అవకాశం ఎక్కువగా ఉంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వైద్యులను నియమించాలని ప్రజలు కోరుతున్నారు.

వైద్యులను నియమించాలి..: సత్యనారాయణ, కాగజ్‌నగర్



సీహెచ్‌సీలో వెంటనే అన్నీ శాఖలకు సంబంధించిన వైద్యులను నియమించాలి. భవనంలో అన్ని వసతులున్నాయి. వైద్యులు లేకపోవడంతో చికిత్స అందడం లేదు. కాగజ్‌నగర్‌తో పాటు చుట్ట పక్కల మండలాల ప్రజలు నిత్యం ఆస్పత్రికి వస్తారు. రోగుల సంఖ్య పెరుగుతున్నప్పటికీ సిబ్బంది సరిపడా లేకపోవటంతో గంటల కొద్ది నిరీక్షించాల్సి వస్తోంది. ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

ఉన్నతాధికారులకు నివేదించాం..

డాక్టర్ చెన్నకేశవరావు, సూపరింటెండెంట్

కాగజ్‌నగర్ సీహెచ్‌సీలో ఉన్న ఖాళీ పోస్టుల భర్తీ జాబితాను ఉన్నతాధికారులకు పంపించాం. ప్రస్తుతం నలుగురు డిప్యూటేషన్ వైద్య సేవలు అందిస్తున్నాం. సరిపడా సిబ్బంది కేటాయించాలని వైద్య ఆరోగ్య శాఖకు నివేదిక పంపించాం.



రోగుల నుంచి రక్తనమూనాలను సేకరిస్తున్న సిబ్బంది

'మిషన్ భగీరథ'పై గ్రామాల్లో సర్వే



జంగాంలో సర్వే నిర్వహిస్తున్న సిబ్బంది

జైనూర్, జున్14: గ్రామాల్లో మిషన్ భగీరథ నీటిని ప్రజలు సద్వినియోగం చేస్తున్న తీరుపై గ్రామ కార్యదర్శులు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శుక్రవారం సర్వే నిర్వహించారు. మండలంలోని 26 గ్రామ పంచాయతీలలో సంబంధిత గ్రామ కార్యదర్శులు ప్రత్యేక సర్వే నిర్వహించారు. గ్రామాల్లో ప్రతి రోజు మిషన్ భగీరథ నీరు సరఫరా అవుతున్నట్లు గ్రామస్థులు చెబుతున్నారు. జంగాం పంచాయతీలోని గొందిపటార్‌లో మాత్రం వారంలో రెండు, మూడు సార్లు మాత్రమే నీటి సరఫరా కొనసాగుతుందని గ్రామస్థులు వివరించారు.

కెరమెరి: మిషన్‌భగీరథ సర్వేను పకడ్బందీగా చేపట్టాలి ఎంపీడీవో అంజద్‌పాషా అన్నారు. శుక్రవారం ఆయన ఎంపీడీవో కార్యాలయంలో కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గత కొన్ని రోజులుగా చేపడుతున్న మిషన్ భగీరథ సర్వే పురోగతిపై కార్యదర్శుల నుంచి వివరాలు సేకరించారు. సర్వేను పకడ్బందీగా చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ విశ్వేశ్వర్, ఏపీవో మల్లయ్య పాల్గొన్నారు.

విద్యార్థులకు పాఠ్య పుస్తకాల పంపిణీ



పాఠ్య పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ మల్లికార్జున్

ఆసిఫాబాద్‌రూరల్, జూన్ 14: మండలంలోని చిర్రకుంట గ్రామంలో బడిబాట కార్యక్ర మంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం ఎంపీపీ మల్లికార్జున్ విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్యతో పాటు మధ్యాహ్న భోజనం, ఉచితంగా పుస్తకాలు, యూనిఫాం అందిస్తున్నా మని తెలిపారు. బడిబయట ఉన్న పిల్లలను బడిలో చేర్పించాలని కోరారు. అనంతరం తుంపల్లి ప్రభుత్వ పాఠశాలను తనిఖీ చేశారు.

ఎంపీ గోడెం నగేష్‌కు సన్మానం



ఎంపీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

కాగజ్‌నగర్, జూన్ 14: ఆదిలాబాద్ ఎంపీ గోడెం నగేష్‌ను శుక్రవారం కాగజ్‌నగర్‌కు చెందిన బీజేపీ నాయకులు కలిసి పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొంగ సత్యనారాయణ, గోలేం వెంకటేష్, గజ్జల లక్ష్మణ్, విజయ్, మాచర్ల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

తాటిచెట్టుపై పిడుగు



కాలుతున్న తాటిచెట్టు

పెంచికలపేట, జూన్ 14: పెంచికలపేట మండలం గుంట్లపేట గ్రామంలో శుక్రవారం సాయంత్రం తాటి చెట్టుపై పిడుగు పడింది. సాయంత్రం సమయంలో ఈదురుగాలులు, వర్షం కురిసింది. ఆ సమయంలో తాటి చెట్టుపై పిడుగు పడి మంటలు అంటుకున్నాయి.

యువత రక్తదానం చేయాలి

కాగజ్‌నగర్, జూన్ 14: యువత రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని బ్లడ్ బ్యాంకు మేనేజర్, డైరెక్టర్ రాజేష్ అన్నారు. స్థానిక జీవన్ ధాన్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో శుక్రవారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బ్లడ్ బ్యాంకు మేనేజర్, డైరెక్టర్ రాజేష్ మాట్లాడుతూ రక్తదానం చేయటం వల్ల ప్రాణాలు కాపాడవచ్చన్నారు. మనిషి శరీరంలో రక్తం ఉత్పత్తి ప్రక్రియ నిరంతరం ఉంటుందన్నారు. రక్తదానం చేయటం వల్ల ఎలాంటి ఇబ్బందులు ఉండవని చెప్పారు. దళిత సంఘం వ్యవస్థాపకుడు ఈర్ల సునీల్ మాట్లాడుతూ రక్తదానం మహాదానం అన్నారు. రక్తదానం చేసిన వారికి లక్ష రూపాయల విలువ చేసే యాక్సిడెంటల్ పాలసీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సాయి, పుల్ల శ్రీకాంత్, ఎంపీపీ సత్యం, ల్యాబ్ టెక్నీషియన్ రఘు, శివ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు అక్షరాభ్యాసం

ఆసిఫాబాద్ రూరల్, జూన్ 14: బడిబాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం జిల్లా కేంద్రంలోని జన్కాపూర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. 1వ తరగతిలో ప్రవేశం పొందిన విద్యార్థులకు సామూహిక అక్షరా భ్యాసం నిర్వహించారు. కార్యక్రమంలో నోడల్ అధికారి ఉదయ్‌బాబు, ప్రధానోపాధ్యాయులు అరుంధతి, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వాంకిడి: అర్జుగూడ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు సామూహిక అక్షారాభ్యాసం నిర్వహించారు. విద్యార్థులకు ప్రధానోపాధ్యాయుడు ధర్మబాయి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈవో మను కుమార్, హెచ్‌ఎం నటరాజ్, రూంటురీడ్ రాష్ట్ర పరిశీలకులు నితిన్‌కుమార్, జెనీఫర్‌రాణి, రజిత, సాయినాథ్, జగదీష్, వినేష్, రాజు, సీఆర్పీ సందీప్‌లు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

- వారంలో రెండు రోజులు డ్రైడే పాటించాలి
- కలెక్టర్ వెంకటేష్ దోత్రే



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్, జూన్ 14: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవన సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లాలోని వైద్యాధికారులతో సీజనల్ వ్యాధులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రభుత్వ ఆస్పత్రులలో సాధారణ ప్రసవాలపై శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వైద్య ఆరోగ్య శాఖ, పంచాయతీ, మున్సిపల్ అధికారులు సమన్వయం చేసుకుంటూ సీజనల్ వ్యాధులను అరికట్టాలని సూచించారు. పారిశుధ్య నిర్వాహణ పనులను సక్రమంగా చేపట్టి ప్రజలు డెంగీ, మలేరియా, చికున్‌గున్యా లాంటి వ్యాధుల బారిన పడకుండా ముందస్తు చర్యలు చేపట్టాల న్నారు. డ్రెయినేజీలు ఎప్పటికప్పుడు శుభ్ర పర్చాలన్నారు. తాగునీరు కలుషితం కాకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఎప్పటికప్పుడు నీటి ట్యాంకులను శుభ్ర పరిచి క్లోరినేషన్ ప్రక్రియ సజావుగా నిర్వహించాలని సూచించారు. నీరు నిలువ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నీరు నిలువ ఉండే చోట ఆయిల్ బాల్స్ వేయాలని, దోమలు రాకుండా ఫాగింగ్ చేయాలని తెలిపారు. వారానికి రెండు రోజులు డ్రై డే పాటించాలని చెప్పారు. వర్షాకాలంలో వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది ఎల్లప్పుడు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ప్రతీ ప్రాథమి క ఆరోగ్య కేంద్రం నుంచి ప్రతి రోజు జ్వరాలపై నివేదిక సమర్పించాలని ఆదే శించారు. జ్వరం కేసులు వచ్చినట్లయితే ఎక్కువ దృష్టి కేంద్రీకరించి తక్షణమే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాలని ఆదేశించారు. ఆర్బీఎస్కే బృందాలుజిల్లాలోని అన్ని రెసిడెన్షియల్ పాఠశాలలు, పాఠశాలలు, కళాశాలలు, కేజీబీవీ విద్యాలయాలు, మోడల్ పాఠశాలలను నిరంతరం సందర్శించి విద్యార్థుల ఆరోగ్యాన్ని పరీక్షించాలని సూచించారు .జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలపై అవగాహన కల్పించాలన్నారు. ప్రసూతి మరణాలపై వైద్యులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సమావేశంలో డీఎంహెచ్‌వో తుకారాం భట్, వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

● నులి పురుగుల నివారణ మాత్రలు అందించాలి

జిల్లాలో 1-19 సంవత్సరాల వయస్సు గల పిల్లలు 1,73, 494 మంది ఉన్నారని, నులి పురుగుల నివారణ మాత్రలు అందించాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో శుక్రవారం జాతీయ నులి పురుగుల నియంత్రణ కార్యక్రమ నిర్వహణకు తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత శాఖ అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 20వ తేదీన నిర్వహించే జాతీయ నులి పురుగల నివారణ కార్యక్రమాన్ని అధికారులు సమన్వయంతో విజయవంతం చేయాలని అన్నారు. నులి పురుగుల నివారణ మాత్రలే వేసుకోవడం వల్ల పిల్లలకు కలిగే లాబాలపై పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, కళాశాలల్లో విస్తృతమైన అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని ఆదే శించారు. జిల్లా విద్యా, వైద్య, పంచాయతీ, శిశు సంక్షేమం, గ్రామీణాభివృద్ధి శాఖలతో సమన్వయం చేసుకుంటూ జిల్లాలోని వంద శాతం మంది పిల్లలకు నులిపురుగుల నివారణ మాత్రలను అందించాలని తెలిపారు. ఏదైనా కారణం చేత పిల్లలు ఈ నెల 20న మాత్రలు తీసుకోనట్లయితే జూన్ 27న అవకాశం ఉంటుందని తెలిపారు. నులి పురుగుల నివారణ మాత్రలను పిల్లలకు భోజనం చేసిన అనంతరమే అందించాలన్నారు. ఏ ఫైనా పిల్లలకు మాత్రలు అందించే ముందు వారి ఆరోగ్య పరిస్థితిని గురించి తెలుసుకోవాలని సూచించారు. పిల్లలెవరికీ మాత్రలు ఇంటి వద్దకి ఇవ్వకూడదని చెప్పారు. చిన్న పిల్లలకు అందించే ముందు మాత్రలను పొడి రూపంలో అందించాలని తెలిపారు. సమావేశంలో డీఎంహెచ్‌వో తుకారాంభట్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్, డీపీవో భిక్షపతిగౌడ్, విద్యాశాఖ లైజన్ అధికారి ఉదయ్‌బాబు, ఎస్సీ సంక్షేమాధికారి సజీవన్, బీసీ సంక్షేమాధికారి సత్యనారాయణరెడ్డి, జిల్లా సంక్షేమాధికారి భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

● గ్రంథాలయాల్లో సౌకర్యాలు కల్పించాలి

ఆసిఫాబాద్, జూన్ 14: జిల్లాలోని గ్రంథాలయాల్లో పాఠకులు, విద్యార్థులు, నిరుద్యోగ అభ్యర్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని గ్రంథాలయాన్ని శుక్రవారం జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి సరితతో కలిసి సందర్శించి గ్రంథాలయ పరిసరాలను పరిశీ లించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా కేంద్ర గ్రంథాలయాన్ని రూర్బన్ పథకం లో భాగంగా నిర్మించామని చెప్పారు. ఇందులో కావాల్సిన అదనపు పనుల కోసం ప్రతిపా దనలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. గ్రంథాలయాలను పాఠకులు, విద్యార్థులు, పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే నిరుద్యోగ అభ్యర్థులకు అవసరమైన పత్రికలు, పుస్తకాలు, మెటీరియల్ అందుబాటులో ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో టీఎస్‌ఈడబ్ల్యూఐడీసీ ఇంజనీర్లు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

మహిళా సంఘాలకు చేయూత

ఆసిఫాబాద్, జూన్ 14: మహిళా సంఘాలు స్వశక్తితో ఎదిగేందుకు చేయూతనివ్వాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. శుక్రవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. మహిళా సంఘాలు స్వశక్తితో ఎదిగేందుకు ప్రోత్సహించాలన్నారు. వ్యాపారం చేసుకునేలా అధికారులు కృషి చేయాలన్నారు. ఔత్సాహిక మహిళా సంఘాలు చేపలపెంపకం వైపు దృష్టి సారించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. నీటి సౌకర్యం ఉన్న చోట మత్స్యకారుల గ్రూపు సంఘాలు, ఎస్టీ సంఘాలు, ఎస్సీ సంఘాలను చేపల పెంపకం వైపు ప్రోత్సహించాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ దీపక్ తివారి, గ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్, లీడ్‌బ్యాంకు మేనేజర్, స్త్రీశక్తి మేనేజర్, జిల్లా ప్రాజెక్టు మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.

పాత విధానంలోనే పర్మిట్లు ఇవ్వాలి

ఆసిఫాబాద్‌రూరల్, జూన్ 14: కట్టె మిల్లుల నుంచి కొనుగోలు చేసే కర్రకు సంబంధించిన పర్మిట్లు పాత విధానంలో ఇవ్వాలని సామిల్ టింబర్ మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షుడు మురళీధర్ డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా అటవీ శాఖాదికారి కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు సభ్యులు మా ట్లాడుతూ ఇబ్బందులు కలుగకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో ఆంజనేయులు, అఖిల్, రమేశ్ పాల్గొన్నారు.

'బడిబాట'ను విజయవంతం చేయాలి

- గ్రామాల అభివృద్ధికి చర్యలు
- అర్హులకు సంక్షేమ పథకాలు
- ఎమ్మెలే పాల్వాయి హరీష్‌బాబు



విద్యార్థులకు ఏకరూప దుస్తులు అందజేస్తున్న ఎమ్మెల్యే హరీష్‌బాబు

కాగజ్‌నగర్, జూన్ 14: బడిబాట కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు అన్నారు. ఆరెగూడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బడిబయట ఉన్న పిల్లలను బడిలో చేర్పించేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు ఉచితంగా నోట్‌బుక్, పుస్తకాలు, ఏకరూప దుస్తులు అందజేస్తున్నారని తెలిపారు. వీటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్, మానస, ఉపాధ్యాయులు స్వరూప, అనూష, సంధ్య, రమేష్, రాజేష్, ఎంపీటీసీ శోభ, లావణ్య, సాంబయ్య, రాందాస్, బాబురావు, గణపతి, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి

చింతలమానేపల్లి: గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తున్నామని ఎమ్మె ల్యే పాల్వాయి హరీష్‌బాబు అన్నారు. చింతలమానేపల్లి మండలానికి చెందిన పలు గ్రామాల్లోని 114 లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు మంజూరు కాగా స్థానిక నాయకులతో కలిసి శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ప్రతి లబ్ధిదారుడికీ అందే విధంగా తమ వంతు ప్రయత్నం చేస్తున్నామని అన్నారు. మండలంలో పోడు భూముల సమస్యలు చాలా తీవ్రంగా ఉందన్నారు. పోడు భూముల సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. మారుమూల ప్రాంతాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నిధులు కూడా తీసుకువస్తామని తెలియజేశారు. అనంతరం చింతలమానేపల్లి మండల కేంద్రానికి చెందిన విద్యార్థులు నీట్, ఎంబీబీఎస్, ఐఐటీ కోర్సులో సీటు సాధించడంతో వారిని ఎమ్మెల్యే హరీష్‌బా బు సత్కరించి అభినందించారు ఈ సందర్భంగా మండల పాత్రికేయులు మండల కేంద్రంలో ప్రెస్ క్లబ్ నిర్మాణం చేపట్టాలని ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేశారు. సమస్యల పరిష్కా రానికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ నానయ్య, జడ్పీటీసీ శ్రీదేవి, నాయకుల నాజీంహుస్సేన్, డీటీ మష్కూర్ అలీ, బీజేపీ నాయకులు మల్లయ్య, శ్రీశైలం, నానయ్య, రంగన్న, తుకారాం, పవన్, మోహన్, మురళీ, రమేశ్, సాయి, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

కౌటాల: మండల కేంద్రంలోని రైతు వేదికలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 100 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుమూల గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆయన వెంట ఎంపీపీ విశ్వనాథ్ తదితరులు ఉన్నారు.



ఉద్యోగుల సంక్షేమంపై దృష్టి సారించాలి



సమావేశంలో మాట్లాడుతున్న జీఎం సంజీవరెడ్డి

శ్రీరాంపూర్, జూన్ 14: సింగరేణి ఉద్యోగుల సంక్షేమంపై దృష్టి సారించాలని ఏరియా జీఎం బి సంజీవరెడ్డి అన్నారు. అన్ని గనులు, విభాగాల పర్సనల్ అధికారులతో శుక్రవారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఉద్యోగుల పిఎంఈ సకాలంలో పూర్తయ్యేలా చూడాలని, పర్సనల్ రికార్డులు, వారి, వారి కుటుంబ సభ్యుల ఫోటోల అనుసంధానం, ఆదాయపు పన్నుకు సంబంధించి పాన్ నంబర్, ఆధార్ నంబర్ అనుసంధానం చేయించాలని, కాంట్రాక్ట్ ఉద్యోగుల సంక్షేమానికి సంబంధించిన అంశాలను ప్రతి ఒక్క సంక్షేమాధికారి వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. దీర్ఘకాలికంగా గైర్హాజరవుతున్న ఉద్యోగులకు ఆయా గనులు, విభాగాలలో కౌన్సెలింగ్ నిర్వహించాలని, ఏరియా స్థాయిలో కౌన్సెలింగ్ ఏర్పాటు చేసి హాజరు శాతాన్ని పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీజీఎం(పర్సనల్) పి అరవిందరావు, పర్సనల్ మేనేజర్ రాజేశ్వర్, డిప్యూటీ పర్సనల్ మేనేజర్లు దేవేందర్‌రెడ్డి, పాలకుర్తి రాజు, సీనియర్ పీవోలు పి కాంతారావు, సునీల్ కుమార్, గౌస్‌పాషా, సంతన్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

ప్రమోషన్ పత్రాలు అందజేత

శ్రీరాంపూర్, జూన్ 14: ప్రతి ఏడాది అందించే యాక్టింగ్ ప్యానల్ ప్రమోషన్ పత్రాలను ఆర్‌కే 6 గని మేనేజర్ ఈ తిరుపతి ఆధ్వర్యంలో శుక్రవారం పంపిణీ చేశారు. కోల్‌కట్టర్లు, సపోర్ట్‌మెన్, ట్రామర్, లైన్‌మెన్, మేషన్, ఫ్యాన్ ఆపరేటర్, హెల్పర్, టబ్ రిపేర్ మజ్దూర్ పదోన్నతులు 77 మందికి వచ్చాయి. ఆయా పత్రాలను గనిపై అందరికీ అందించారు. కార్యక్రమంలో గని రక్షణాధికారి కాదాసి శ్రీనివాస్, ఏఐటీయూసీ ఉప ప్రధాన కార్యదర్శి ముష్కె సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కె బాజీసైదా, పిట్ కార్యదర్శి సంగం సదానందం, తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

రెబ్బెన, జూన్ 14: సింగరేణి కాలరీస్ నస్పూర్‌లోన పాలిటెక్నిక్ కళాశాలలో ప్రవేశాలీ కోసం సింగరేణి ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు పిల్లలు మాత్రమే దరఖాస్తులు చేసుకోవాలని అధికార ప్రతినిధి రెడ్డిమల్ల తిరుపతి శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. కళాశాలలో మొత్తం 150 సీట్లు ఉన్నాయని పేర్కొన్నారు. ఇందులో ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ విభాగం 30 సీట్లు, మెకానికల్ 30, సివిల్ 30, మైనింగ్ 30 కంప్యూటర్ విభాగం సీట్లు 30 భర్తీ చేస్తారని తెలిపారు. పాలిసెట్‌లో అర్హత పొందిన విద్యార్థులు మాత్రమే అర్హులని తెలిపారు. అర్హత కలిగిన వారు 28-06-2024 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఈపీ ఆపరేటర్ గ్రేడ్ టెస్టు పరిశీలన

రెబ్బెన, జూన్ 14: ఈపీ ఆపరేటర్ గ్రేడ్ టెస్టు పరీక్షలను ఏఐటీయూసీ ఖైరిగూడ పిట్ కార్యదర్శి మారం శ్రీనివాస్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఈపీ ఆపరేటర్లతో ఆయన మాట్లాడారు. పరీక్షకు ఎలా సన్నద్ధం కావాలన్న విషయాలపై ఆపరేటర్లతో మాట్లాడారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన వారికి భోజన వసతి కల్పించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ ఆర్గనైజింగ్ సెక్రటరిలు జూపాక రాజేష్, కిరణ్ బాబు, ఎం.చంద్రశేఖర్, శేషు, దివాకర్, రాయిని రాజయ్య పాల్గొన్నారు.